ఆంధ్రజ్యోతి

# సిలికాన్‌వేలీలో అన్నమయ్యకు సుస్వరార్చనం

శాన్‌హోసె, జనవరి 22 : అమెరికాలోని సిలికాన్ వేలీ శనివారంనాడు అన్నమయ్య పదాలతో మార్మోగిపోయింది. గజగజలాడిస్తున్న చలిలో అసాధారణ రీతిలో సాగిన నగరసంకీర్తనతో సిలికాన్‌వేలీ పులకించిపోయింది. సన్నివేల్ దేవాలయంలోని హిందూ కమ్యూనిటీ సెంటర్‌లో అపూర్వరీతిలో అన్నమాచార్య సంకీర్తనోత్సవం ఘనంగా సాగింది. ఉదయం 9 గంటలకు మొదలై ఏకధాటిగా రాత్రి 10.30 గంటలవరకూ సాగిన ఈ సంకీర్తనోత్సవం శాస్త్రీయ సంగీతాభిమానులను రసజగత్తులో ఓలలాడించింది. 116 అన్నమయ్య కృతులను పాడుతూ, నర్తిస్తూ వందలాదిమంది సిలికానాంధ్రులు పులకించిపోయారు. పదకవితా పితామహుడికి ఘననివాళిగా ఈ సంకీర్తనోత్సవం సాగింది.

సిలికానాంధ్ర కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామునే 'నగర సంకీర్తన'తో అన్నమాచార్య సంకీర్తనోత్సవం మొదలైంది. నుదుట తిలకంతో, సాంప్రదాయ దుస్తులు ధరించి ఒకపక్క వేదమంత్రోచ్చాటనలు, మరోపక్క అన్నమయ్యకృతులు పాడుతూ పెద్దలు, పిల్లలు తిరువీధులలో సాగిపోయారు. అమెరికాలో పుట్టి పెరిగిన వందలాదిమంది బాలలు, యువకులు ఈ అపూర్వ నగరసంకీర్తనలో పాల్గొనడం విశేషం.

నగరసంకీర్తన సభా ప్రాంగణానికి చేరుకోగానే చెరకుపల్లిగణేశ శర్మ వేదపఠనం, సిలికానాంధ్ర అధ్యక్షులు విస్సంరాజు శ్రీఫణి ప్రారంభోపన్యాసంతో కార్యక్రమం మొదలైంది. అన్నమయ్య పదానికి

మరింత ప్రాచుర్యాన్ని తీసుకువచ్చేందుకు తాము అకుంఠితదీక్షతో పరిశ్రమిస్తామని, మున్ముందు భారతదేశమంతటా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీఫణి వెల్లడించారు.

తొలుత సుమారు 40 మంది కళాకారులు గోష్ఠి గానంలో అన్నమాచార్యుని ఏడు ప్రముఖ కీర్తనలను ఆలపించారు. ఆతర్వాత 318 మంది గాయనీగాయకులు, నర్తకీనర్తకులు, వాద్యకారులు ఒకొక్కరుగా, బృందాలుగా వేలాది అన్నమయ పదకవితలలో తమకు నచ్చిన గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కె.వి. రమణాచారి (ఐ.ఎ.ఎస్.) పాల్గొన్నారు. అన్నమయ కరుణామృతం సిలికానాంధ్రవాసులపై వర్షిస్తుందని వ్యాఖ్యానిస్తూ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సిలికానాంధ్ర చేస్తున్న కృషిని అభినందించారు. సంకీర్తనోత్సవానికి శ్రీమతి హేమ కోట, వైజయంతి సుసర్ల నేతృత్వం వహించారు. వారి ఆధ్వర్యంలో సిలికానాంధ్ర కార్యకర్తలు అహోరాత్రులూ శ్రమించి 318 మంది కళాకారులను చక్కగా మలిచి వారంతా రాగయుక్తంగా కీర్తనలు పాడేలా తీర్చిదిద్దారు.

శ్రీహరిశాస్త్రి, శ్రీమతి శ్రీలక్ష్మి కోలవెన్ను, శ్రీమతి గాయత్రి అవ్వారి కృతులను ఆలపించేందుకు, గోష్ఠి గానానికి విశేష కృషిచేసారు. సిలికానాంధ్ర వాసులు అన్నమయ్య కృతుల ప్రచారానికి చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టువారు 150 అన్నమాచార్య కృతులను స్వరపరచే బాధ్యతను అప్పగించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు 'అన్నమాచార్య రాగరాగిణి' అని నామకరణం చేసారు. అన్నమాచార్య ప్రాజెక్టు నిర్దేశకులు మేడసాని మోహన్ దూరవాణిలో తన సందేశాన్ని వినిపించారు. వంశీ నాదెళ్ళ, నారాయణరాజు డియోవిభాగాన్ని సమర్థంగా నిర్వహించారు. స్వరార్చన కార్యక్రమాని ్ని పెద్దతెరపై చూపారు.